సేల్స్‌మెన్ ఎవరికో వెండికుందులు చూపిస్తుండడంతో షాపులో ఓ వారగా నిలబడింది మాధురి. ఎంత రిక్షాలో వచ్చినా...ఎండపాడ తగిలిన ప్రాణం కొంచెం కొంచెంగా కుదుటపడసాగింది ఏ.సి. చల్లదనానికి. టైంపాస్‌కి చేపపిల్లలా గెంతులు వేస్తున్న ఆమె కళ్లు చటుక్కున ఆగాయి ఓ చోట.

"మేడమ్! చెప్పండి...ఏమి కావాలి?.." వెంటనే జవాబు రాకపోడవడంతో విషయం అర్థమైనవాడిలా "ఏమిటలా చూస్తున్నారు...ఆ గుమ్మం దగ్గర ఆవిడనేనా..?" తలూపింది అవునన్నట్టు.

"నాలుగు రోజులక్రితం తీసుకెళ్ళిన ఉంగరం ఇంట్లో వాళ్ళకు నచ్చలేదు ఇంకో వస్తువు ఇమ్మని..."

మాట పూర్తికాకముందే "పోనీ ఇచ్చేయొచ్చుగా...డబ్బులు ఇమ్మన్నేలదుగా...ఏదో పొరపాటున తీసుకెళ్ళుంటుంది...ఇల్గాగైతే బేరాలు పోవా?" మాధవి మాటల్లో సానుభూతి. అంతలోకే ఏదో స్ఫురించినదాన్లా "అవును...ఏదో వాదన జరుగుతున్నదని అర్థమైందిగానీ విషయమిదని నాకే తెలియలేదు...పనిలో ఉన్న నీకు..." కాస్తంత సంభ్రమం.


అతడదోలా నవ్వేసి "అమ్మ పుట్టిల్లు మేనమామకి తెలియదా? ఎప్పుడూ వచ్చే ఆమె గురించి ఇక్కడ అందరికీ తెలుసు...వస్తే ఓ పట్టాన జలగలా వదలదు...కదలదు" తెలిసినామె గురించి అంత ఇదిగా...మాధవి ఓ క్షణం దిగ్భ్రాంతికి లోనయింది.నోరుజారినందుకు సేల్స్‌మెన్ క్షణకాలం కలవరపడినా...వాళ్ళిద్దరూ అపరిచితులన్న విషయం ధైర్యాన్నివ్వగా..."మేడమ్..ఆమె నైజం తెలిస్తే మీరూ చిరాకు పడతారు...ఇందాకన్నారే పొరపాటని...ఆవిడకదో అలవాటు.." చరిత్రంతా చెప్పుకొచ్చాడు లోగొంతుకతో.

"ముందు ఒక వస్తువుకొని నాలుగు రోజుల తర్వాత మావారికి నచ్చలేదంటూ...అదిచ్చి వేరేది పట్టుకెళుతుంది...మళ్ళీ నాలుగు రోజులాగి ఏదోకారణం చెప్పి అదిచ్చి ఇంకోటి ఇమ్మంటుంది...ఇవ్వకుంటే ఇలాగే రొద..కాకుంటే తెలిసిన వాళ్ళందరిని ఇక్కడికే తీసుకొస్తుందని- ఓనర్ ఒకసారి కాదన్నా ఒకసారి ఇస్తుంటాడు..చీరెల భాగోతంకూడా ఇంతేనట...అంచులు, ఫాల్ కుట్టకుండా ఒకసారి అలా కట్టేసి ఇలా ఇచ్చేస్తుందట...ఆమె పెట్టుకున్నవి, కట్టుకున్నవి ఎవరో ఒకరికి వెళతాయి కదా! ఎంత పాపం..."

"తీసుకునే వాళ్ళది మాత్రం పాపంకాదా..." మాధవి లోలోపల గొణుక్కుంటూ పైకి "మరి...పెద్ద వస్తువులు.." అడ్డంగా తలూపాడు.

"ఉహూ...అవిమాత్రం ఇవ్వడు...అలవాటయిన ప్రాణం ఊరుకోలేక సంవత్సరానికో..రెండేళ్ళకో కొంచెం లాస్‌మీద మార్చేస్తుంది. ఓనర్ వాటికి మెరుగుపెట్టి కొత్తవిగా అమ్ముకుంటాడు..." ఆ చివరిముక్క చెప్పకపోయినా అర్థమయ్యిందామెకు.

"అయితే ఆవిడ వచ్చినప్పుడల్లా మీకు పనే...మీ ఓనర్‌కి చిరాకే.." సానుభూతిగా చూసింది.



# ఇదోరకం పిచ్చి

-కొమ్మూరి హైమావతి

"అవును...అందుకే మా ఓనర్‌గారు ఆమె వస్తువులు మార్చినప్పుడు 'లాస్' కింద తగ్గించిన డబ్బులు మాకిస్తుంటారు. అదేకాకుండా ఆవిడ వచ్చినప్పుడల్లా పదో, పరకో మా చేతిలో పెడుతుంటారు...మేడమ్! ఏదో గబుక్కున నోరు జారాను...ఎక్కడా అనకండమ్మా..నా ఉద్యోగానికి ముప్పొస్తుంది" భయం తారాట్లాడింది గొంతులో.

మాధవి అభయమిస్తున్నట్టుగా "ఛ...ఛ. .ఆమెవరో కూడా తెలియదు. మధ్యలో నాకెందుకు గొడవ.." అంటూ తను వచ్చిన పని చెప్పింది.'హార్నీ...లోకంలో ఇలాంటి తెలివితేటలు కూడా ఉంటాయా? కుండలో అన్నం కుండలోనే ఉండాలి. పిల్లలు దుడ్డుల్లా పెరగాలన్నట్టు...డబ్బులు ఖర్చు కాకూడదు కట్టిన చీరె కట్టకుండా, పెట్టిన నగలు పెట్టకుండా గొప్ప ఆస్తిపరుల్లా డాబు, దర్పం- అందరూ ఇలా ఉంటారని కాదూ...అక్కడక్కడ తగులుతుంటారు. రకరకాల మనుషులు...రకరకాల పిచ్చి! వాటిల్లో ఇదోరకం పిచ్చి కాబోలు! వాళ్ళ మనసుకి తాము చేస్తుంది తప్పని తెలియాలి కానీ, ఎవరూ సాహసించి చెప్పగలరు. షాపువాళ్ళు తీసుకోకుండా ఉంటే ఆవిడ 'పిచ్చి' తగ్గుతుంది కానీ, వాళ్ళ 'లాభాన్ని' వాళ్ళెందుకు వదులుకుంటారు.. సర్లే...కందకు లేని దురద కత్తికెందుకన్నట్టు- మధ్యలో నాకెందుకు...విషయం తెలిసింది కాబట్టి ఈ షాపుకి ఇంకెప్పుడూ రాకుండా ఉంటే సరి'

"మేడమ్...." సేల్స్‌మెన్ పిలుపుతో తేరుకుంటూ, గజ్జెలు, హుక్కులు మార్చి, మెరుగుపెట్టడంతో తళతళ మెరుస్తున్న వెండి పట్టాల్ని తీసుకొని బిల్ చెల్లించి బైట పడింది మాధవి.

★